ప్రజాశక్తి
బుధవారం 31 జులై 2024
5
విజయనగరం

అంధుల పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్థానిక పూల్‌బాగ్ కాలనీలో ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో 1-నుంచి 8వ తరగతిలో ప్రవేశాలకు అంధ బాల బాలికల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ ఎం.మహేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వయసు 6 నుంచి 14 సంవత్సరాల లోపు, కనీసం 40శాతం అంధత్వం గల బాలబాలికలు ఈ పాఠశాలలో ప్రవేశానికి అర్హులని తెలిపారు. సదరం వైద్య ధ్రువీకరణ పత్రం సమర్పించాలని సూచించారు. సాధారణ పాఠశాలలో విద్యనభ్యసిస్తూ దృష్టి లోపం ఉన్న బాల బాలికలు బదిలీ, వైద్య ధ్రువీకరణ పత్రాలను సమర్పించి ప్రవేశం పొందవచ్చన్నారు. ప్రవేశం పొందినవారికి ప్రభుత్వం ఉచిత వసతి, పౌష్టికాహారం, ఆధునిక బ్రెయిలీ సామగ్రితో విద్య, కంప్యూటర్ శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకష్ణ విద్యామిత్ర, తల్లికి వందనం, మనబడి-మన భవిష్యత్తు తదితర ప్రభుత్వ పథకాలు కూడా వర్తిస్తాయని తెలిపారు. పాఠశాలలో మొత్తం 31 ఖాళీలు ఉన్నాయని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఆశల పల్లకిలో అన్నదాత

- అనుకూలిస్తున్న వర్షాలు
- లక్ష్యాన్ని మించి నారుపోత
- గత ఏడాదితో పోలిస్తే ముందుగానే సాగుతున్న ఉబాలు

నాట్లు వేస్తున్న మహిళా కూలీలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

వర్షాలు అనుకూలిస్తుండడంతో అన్నదాత ఆశల పల్లకిలో ఊరేగుతున్నాడు. లక్ష్యానికి మించి నారుపోత కనిపిస్తోంది. గతేడాదితో పోలిస్తే ఉబాలు కూడా ముందుస్తుగా సాగుతున్నాయి. జిల్లా వరి సాధారణ విస్తీర్ణం 2,25,145 ఎకరాలు కాగా, ఇప్పటి వరకు 2,29,100 ఎకరాల విస్తీర్ణానికి సరిపడినంత నారు పోత జరిగింది. గతంతో పోలిస్తే వర్షాలు అనుకూలించడమే ఇందుకు కారణమని వ్యవసాయ శాఖ అధికారులు విశ్లేషిస్తున్నారు. గతేడాది ఇదే సమయానికి 25,145 ఎకరాల్లో వరినాట్లు పడగా, ప్రస్తుతం 39,020 ఎకరాల్లో నాట్లుపడ్డాయి. ఇందులో 30,835 ఎకరాల్లో ఉబాలు కాగా, 8185 ఎకరాల్లో యద రూపంలో పడింది. బొబ్బిలి, రాజాం అసెంబ్లీ నియోజవర్గాల పరిధిలో ఎక్కువగా వరినాట్లు పడినట్టు అధికారులు లెక్కచూపుతున్నారు. గడిచిన పదేళ్లలో మునుపెన్నడూ లేనంతగా ఈ ఏడాది సీజన్ ప్రారంభం (జూన్ నెల) నుంచే వర్షాలు అనుకూలించాయి. ఆనెలాఖరు నాటికి 35శాతం అధిక వర్షపాతం నమోదైంది. అప్పుడే నారు ముడులు సిద్ధం చేసుకున్నవారు ప్రస్తుతం నీటి వసతి ఉన్నచోట్ల ఉబాలు పడుతున్నారు. జులైలో మొదటి పది రోజులు చినుకులు రాలకపోవడంతో నారు పోతకు కాస్త అంతరాయం కలిగింది. అనంతరం కురిసిన వర్షాలతో ఈనెలలో ఇప్పటి వరకు 35శాతం అధిక వర్షపాతం ఉంది. గత పది రోజులుగా వర్షాలు కురవడంతో చెరువులు 70శాతం వరకు నిండాయి. జలాశయాలు కూడా కళకళలాడుతున్నాయి. ఫలితంగా రైతులు ఒకింత ఉత్సాహంతో ఉన్నారు. గతేడాది జూన్ లోనే లోటు వర్షపాతం నమోదు కావడంతో ఆగస్టు వరకు ఉబాలు మొదలవ్వలేదు. ప్రస్తుతం వాతావరణం అనుకూలించడంతో ఎక్కుచోట్ల నారు పెరిగే దశలో ఉంది. కొన్నిచోట్ల ఉబాల ప్రారంభం కావడంతో రైతులు ఎరువుల కోసం పరుగులు తీస్తున్నారు. అధికారులు అన్ని చోట్లా ఎరువులు అందుబాటులో ఉన్నాయని భరోసా ఇస్తున్నారు. దాదాపు అన్నిచోట్లా ఉబాలన్నీ ట్రాక్టర్లతోనే చేపడుండడంతో డబ్బు ఉంటే తప్ప రైతులు ముందుకు సాగలేని పరిస్థితి. ఈనేపథ్యంలో చాలా మంది బ్యాంకు రుణాల కోసం ఎదురు చూస్తున్నారు. కొత్త రుణాల సంగతి అటుంచితే రుణాల రీషెడ్యూల్ చేసే పనిలో మాత్రం బ్యాంకర్లు బిజీబిజీగా ఉన్నారు. అయితే, కొత్తరుణాలు పొందగలిగిన రైతుల సంఖ్య అంతంత మాత్రంగానే ఉంది. ముఖ్యంగా కౌలు రైతులకు నిబంధనల పేరుతో బ్యాంకర్లు మోకాళ్లొడ్డుతున్నారు. ఈనేపథ్యంలో రుణసాయంపై అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

టోల్ ప్లాజాను ఎత్తి వేయాల్సిందే

ఎత్తేసే వరకు పోరాడతాం : మహాధర్నాలో ప్రజా సంఘాల నాయకులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

ప్రజాశక్తి-డెంకాడ

విజయనగరం, విశాఖపట్నంకు నిత్యం వివిధ పనులపై ప్రయాణించే జొన్నాడ జాతీయ పై కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అక్రమ టోల్‌గేట్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తూ ప్రజాసంఘాల ఆధ్వర్యాన మంగళవారం టోల్‌ప్లాజా వద్ద మహాధర్నా చేపట్టారు. ధర్నాలో విజయనగరం ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి గజపతిరాజు, ఎమ్మెల్సీలు పి.రఘువర్మ, పి.సురేష్‌బాబు పాల్గొని మద్దతు తెలిపారు. పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి రెడ్డి శంకర్రావు, పౌర వేదిక నాయకులు భీశెట్టి బాబ్జీ ఆధ్వర్యాన జరిగిన ఈ ధర్నాలో ఎమ్మెల్యేఅదితి విజయలక్ష్మి మాట్లాడుతూ తొలినుంచి ఈ టోల్ ప్లాజాకి వ్యతిరేకంగా ఉన్నామని ఈ టోల్ ప్లాజా వలన విద్యార్థులు, స్థానిక ప్రజలు, చిరు వ్యాపారులు తీవ్రంగా నష్టపోతున్నారని, అందుకే మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాశారని తెలిపారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ మాట్లాడుతూ టోల్ ప్లాజాని రద్దు చేయాలని రెండు జిల్లాల ప్రజలు కోరుకుంటున్నారని, అవసరం లేని చోట టోల్ ప్లాజా పెట్టి ప్రజలను ఇబ్బందులు పెట్టడం మంచి పద్ధతి కాదని అన్నారు. మరో ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు మాట్లాడుతూ ప్రజల ఆవేదనను పాలకులు అర్థం చేసుకుని వెంటనే టోల్ ప్లాజాని తొలగించాలని, లేకపోతే ఇది మరో స్థాయిలో ప్రజాఉద్యమం గా మారుతుందని అన్నారు.

టోల్‌గేట్ వద్ద ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, ప్రజాసంఘాల నాయకులు, ప్రజలు

రెడ్డి శంకరరావు, భీశెట్టి బాబ్జీ మాట్లాడుతూ ఈ అక్రమ టోల్‌గేట్ వల్ల ప్రజలపై కోట్లాది రూపాయలు భారాలు పడుతున్నాయని అన్నారు. పాత రోడ్డుకు టోల్ వెయ్యడం అత్యంత దుర్మార్గమని తక్షణమే టోల్‌గేట్ ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే నాతవలసలో టోల్ ప్లాజా ఉందని, జొన్నాడ కాకుండా రామవరం నరవ మధ్యలో ఒకటి, మానాపురం వద్ద మరొకటి నిర్మాణంలో ఉన్నాయని వాటిని వెంటనే నిలుపుదల చేసి జిల్లా ప్రజానీకానికి టోల్ ప్లాజా చార్జీల నుంచి ఉపశమనం కల్పించాలని కోరారు. లేని పక్షంలో ప్రజలే తగిన బుద్ధి చెపుతారని హెచ్చరించారు.

ధర్నాలో నగరంలోని ట్యాక్సీ, టాటా ఏసీ, డ్రైవర్లు, వారి సంఘాల నాయకుల, డెంకాడ మాజీ ఎంపిపి కంది చంద్ర శేఖర్, మాజీ జెడ్‌పిటిసి అప్పల నారాయణ, భోగాపురం మాజీ ఎంపిపి కర్రోతు బంగార్రాజు, సత్యనారాయణ, మాజీ జెడ్‌పిటిసి ఆకిరి ప్రసాద్, తూర్పు కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు తుమ్మగంటి రామ్మోహన్, బిసి సంఘం అధ్యక్షుడు కెల్ల శ్రీనివాసరావు, మానవ హక్కుల సంఘం అచ్చిరెడ్డి, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు వి. రామచంద్ర రావు. సిఐటియు నగర కార్యదర్శి బి.రమణ, సమన్విత ఏజెన్సీ రెడ్డి,చెరువుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు జాగరపు ఈశ్వర ప్రసాద్, అవనాపు విజయ్, పసాదుల ప్రసాద్, గ్రామీణ వైద్యుల సంఘం నాయకులు గెద్ద చిరంజీవి, ఛాంబర్ ఆఫ్ కామర్స్ రవ్వా శ్రీనివాస్, సమన్విత ఏజెన్సీ నిర్వాహకులు రెడ్డి, జానపద కళాకారుడు జానకి రామ్, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆగస్టు 31లోపు వసతి గృహాల్లో సీట్లు భర్తీ

జిల్లా బిసి సంక్షేమ సాధికారిత అధికారి సందీప్ కుమార్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలోని అన్ని బిసి సంక్షేమ వసతి గృహాల్లో ఆగస్టు 31 నాటికి ఖాళీ సీట్లు అన్ని భర్తీ చేయాలని జిల్లా బిసి సంక్షేమ సాధికారిత అధికారి కె.సందీప్ కుమార్ ఆదేశించారు. మంగళవారం సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారులు, వసతి గృహ సంక్షేమ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 38 బిసి మెట్రిక్ పూర్వపు వసతి గృహాల్లో 3800 మంది విద్యార్థులకు ప్రవేశాలు జరిగాయని తెలిపారు. రెన్యువల్ విద్యార్థులు 1165, ఫ్రెష్ విద్యార్థులు 927 మొత్తం 2092 మంది ప్రస్తుతం వసతి పొందుతున్నారని తెలిపారు. 1608 విద్యార్థులకు సీట్లు మిగిలి ఉన్నాయన్నారు. సీట్లను ఆగస్టు 31లోగా దరఖాస్తు చేసుకునేందుకు వసతి గృహ సంక్షేమ అధికారులు తగిన కృషి చేయాలని కోరారు. 30 కన్నా తక్కువ విద్యార్థులు గల దేవుపల్లి, గోవిందపురం ప్రభుత్వ బిసి బాలికల వసతి గృహాలు, జొన్నవలస, శృంగవరపుకోట ప్రభుత్వ బిసి బాలుర వసతి గృహాల్లో శత శాతం సీట్లు భర్తీ చేయాలని ఆదేశించారు. అనంతరం వసతి గృహాల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాల్లో కిచెన్ గార్డెన్‌లను ఏర్పాటు చేసి ఆదర్శంగా రూపొందించాలని అన్నారు. సమావేశంలో సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఆటలతో మానసిక ఉల్లాసం : జిల్లా జడ్జి

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా న్యాయ శాఖ సిబ్బంది సంఘ అధ్యక్షుడు కె.శ్రీనివాస రావు ఆధ్వర్యంలో జ్యుడీషియల్ స్పోర్ట్ మీట్ ను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి బి.సాయి కళ్యాణ చక్రవర్తి క్యారమ్స్ ఆటల పోటీలను మంగళ వారం ప్రారంభించారు. ఆయన తో పాటు సహచర న్యాయ మూర్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ వృత్తి, ఉద్యోగ భాద్యతలు నిర్వహిస్తున్నప్పుడు ఒత్తిడికి గురైన సందర్భాలు ఎదురవుతాయని అన్నారు. ఆటలు, యోగ ద్వారా కొంత మేర ఉపశమనం కలుగుతుందన్నారు. శారీరిక ధృఢత్వం తో పాటు మానసిక ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని ఇస్తాయన్నారు. కార్యక్రమంలో న్యాయ మూర్తుల , న్యాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు

మైనర్లకు వాహనాలిచ్చి ప్రమాదాల్లోకి నెట్టొద్దు

- పిల్లలకు వాహనాలిస్తే తల్లిదండ్రులపై కేసులు
- కౌన్సిలింగ్ నిర్వహించిన ఎస్‌పి

తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి-విజయనగరం కోట

నగరంలో ఈనెల 29న మైనరు డ్రైవింగ్, ట్రిపుల్ డ్రైవింగ్, సౌండు పొల్యూషను, డేంజరస్ డ్రైవింగ్, డిఫెక్టివ్ నంబరు ప్లేట్లుపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టి పట్టుబడిన మైనర్లు, వారి తల్లిదండ్రులకు జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్ విజయనగరం ట్రాఫిక్ పోలీసు స్టేషను ఆవరణలో మంగళవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ - పిల్లల భవిష్యత్తు, వారిని చదివించేందుకు, ఇతర అవసరాలకు తీర్చేందుకు శ్రద్ధ వహించే తల్లిదండ్రులు, మైనార్టీ తీరని పిల్లలకు ఖరీదైన మోటారు సైకిళ్లను కొనిచ్చి, వారి జీవితాలను ప్రమాదాల్లోకి నెడుతున్నారని అన్నారు. డ్రైవ్ చేసేందుకు మైనర్లను అనుమతించక పోవడానికి మైనర్లలో మానసిక పరిపక్వత, స్థిరత్వం లేకపోవడం, అత్యుత్సాహం, ఆకతాయితనం, అతివేగంగా వాహనాలను నడపడం, ప్రమాదాలను అంచనా వేయకపోవడం వంటి కారణాలుగా కనిపిస్తున్నాయన్నారు. ఈ కారణాలను పరిగణలోకి తీసుకొని మైనర్లుకు డ్రైవింగు లైసెన్సులు మంజూరు చేయడం లేదు. ప్రతీ వాహనానికి రిజిస్ట్రేషను, ఇన్సూరెన్సు, వాహనాలను డ్రైవ్ చేసేందుకు డ్రైవింగు లైసెన్సు తప్పనిసరిగా ఉండాలన్నారు. వాహనాలకు సకాలంలో ఇన్సూరెన్సు చేయించుకోవడం వలన ప్రమాదాలకు గురైనా బాధితులకు చెల్లించాల్సిన డబ్బులను ఇన్సూరెన్సు కంపెనీ చెల్లిస్తుందని, ఒకవేళ మన వాహనాలకు ఇన్సూరెన్సు చేయించకపోతే బాధితులకు చెల్లించాల్సిన సొమ్మును కూడా సొంతంగానే చెల్లించాల్సి ఉంటుందన్నారు. మైనర్లు వాహనాలను డ్రైవ్ చేసి, ఇకపై పట్టుబడితే ఆయా వాహనాలను సీజ్ చేయడంతోపాటు, వారి తల్లిదండ్రులు లేదా వాహన యజమానులపై కూడా కేసులు నమోదు చేస్తామన్నారు. విద్యార్థులపై కేసులు నమోదైతే వారు ప్రభుత్వ ఉద్యోగాలు పొందేందుకు, ఉద్యోగాలు, చదువుల నిమిత్తం విదేశాలకు వెళ్ళేందుకు ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. ఎంవి నిబంధనలు పాటించని వాహనదారులకు ఈ-చలానాలను విధిస్తామన్న విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. రహదారి భద్రత ప్రమాణాలను పాటించడం, హెల్మెట్ ధరించడం, ద్విచక్ర వాహనంపై ఇద్దరు మాత్రమే ప్రయాణించడం, నిర్దిష్ట వేగంతోనే వాహనాలను నడపడం వంటి బాధ్యతలను నిర్వహించాల్సి ఉంటుందన్నారు. స్పెషల్ డ్రైవ్లో పట్టుబడిన 88 వాహనాలను ఎంవి నిబంధనల ప్రకారం సీజ్ చేసే అవకాశం ఉన్నప్పటికీ, మైనర్ల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని, సీజ్ చేసిన వాహనాలను రిలీజ్ చేయాలని, వాహనదారులకు చలానాలను విధించాలని ట్రాఫిక్ డిఎస్‌పి డి.విశ్వనాధన్‌ను ఎస్‌పి ఆదేశించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డిఎస్‌పి డి. విశ్వనాధ్, సిఐ పి.రంగనాధ్, ట్రాఫిక్ ఎస్ఐలు లోవరాజు, శంభాన రవి, ఎ.మహేశ్వర రాజు, త్రినాధరావు తదితరులు పాల్గొన్నారు

వాయుకాలుష్య నియంత్రణకు సమగ్ర ప్రణాళిక

విద్యుత్ వాహన వినియోగాన్ని ప్రోత్సహించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

విజయనగరంలో వాయుకాలుష్య నియంత్రణకు సమగ్ర ప్రణాళికను రూపొందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆదేశించారు. నేషనల్ క్లీన్ ఎయిర్ కార్యక్రమంపై కలెక్టర్ తన ఛాంబర్‌లో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా కేంద్రంలో వాయుకాలుష్యం ఎక్కువ ఉందని, దానిని తగ్గించేందుకు వివిధ శాఖల సమన్వయంతో పటిష్టమైన ప్రణాళికను రూపొందించాలని సూచించారు. నేషనల్ క్లీన్ ఎయిర్ కార్యక్రమం గురించి జిల్లా పొల్యూషన్ ఇంజినీర్ సరిత వివరించారు. దేశంలో వాయు కాలుష్య నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం 2021లో ఈ కార్యక్రమాన్ని రూపొందించిందన్నారు. దేశవ్యాప్తంగా వాయు కాలుష్యం ఎక్కువగా ఉన్న 131 నగరాల్లో విజయగరం కూడా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమం కింద ఇప్పటివరకు పట్టణంలో తీసుకున్న చర్యలను వివరించారు. కలెక్టర్ అంబేద్కర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో వాయుకాలుష్య నియంత్రణకు, సుమారు రూ.2.66 కోట్ల అంచనా వ్యయంతో వార్షిక ప్రణాళికను రూపొందించాలని సూచించారు. గాలిలో ధుమ్ము ధూళి కణాల నియంత్రణకు, వచ్చే మూడు నెలల్లో పట్టణంలోని 70 కిలోమీటర్ల పొడవు ఉన్న ప్రధాన రోడ్లకు ఇరువైపులా, సుమారు 30వేల మొక్కలను నాటేందుకు సిద్ధం కావాలన్నారు. వాహన కాలుష్యాన్ని నియంత్రించాలని, దీనికోసం విస్తతంగా వాహనాలను తనిఖీచేసి, జరిమానా విధించాలని ఆదేశించారు. ముఖ్యంగా విద్యుత్ వాహనాల వాడకాన్ని ప్రోత్సహించాలని, దీనిపై విస్తత ప్రచారం నిర్వహించాలని సూచించారు. దీనికోసం బ్యాటరీ ఛార్జింగ్ పాయింట్లను ఎక్కువగా ఏర్పాటు చేయాలన్నారు. పట్టణంలోని మహిళా సంఘాలచేత విద్యుత్ ఛార్జింగ్ స్టేషన్లు, కాలుష్య తనిఖీ వాహనాలను ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎం.మల్లయ్య నాయుడు, వ్యవసాయశాఖ జెడి విటి రామారావు, ఉద్యానశాఖ డిడి జమదగ్ని, పరిశ్రమలశాఖ డిడి నాగేశ్వర్రావు, డిప్యుటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మణికుమార్, మున్సిపల్ ఇంజనీర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎపిఎండబ్ల్యుఇయు రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గత మూడు పిఆర్‌సిల్లో ఇంజినీరింగ్ కార్మికులకు జరిగిన అన్యాయాన్ని సవరించి జీవో నెంబర్ 16 15, 196 ప్రకారం బేసిక్ వేతనం, డిఎతో కలిపి రూ.25,500 ఇవ్వాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు యు. రాజు డిమాండ్ చేశారు. మంగళవారం నగర కమిటీ 4 వ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ముందుగా నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరించారు. అనంతరం గాంధీ పార్కులో యూనియన్ నగర అధ్యక్షులు బి.భాస్కరరావు అధ్యక్షతన జరిగిన మహాసభలో ఆయన మాట్లాడారు. పారిశుధ్య కార్మికులకు 3 నెలల బకాయి హెల్త్ అలవెన్సులు, రైన్ కోట్లు, యూనిఫామ్, రక్షణ పరికరాలు, పనిముట్లు, ఇవ్వాలి. పుస్కాట్లు రిపేర్లు చేసి ఇవ్వాలన్నారు. చాలా మున్సిపాలిటీల్లో పాడైన పని ముట్లతో కార్మికులు పని చేయాల్సి వస్తుందన్నారు. ద్వంద్వ యాజమాన్యాలతో కార్మికులు నలిగి పోతున్నారు. శానిటరీ ఇన్స్పెక్టర్ పర్యవేక్షణలో పాత పద్ధతి లో పనులు చేయించాలన్నారు. జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలన్నారు. ఇతర విభాగాలకు డిప్యూటేషన్లు రద్దు చేయాలని, పనిభారం తగ్గించాలని కోరారు. థర్డ్ పార్టీ విధానంలో పనిచేస్తున్న లీకులు, మొక్కలు, పార్కులు, పంపు హౌస్, ఫ్లాంటేషన్, నైట్ శానిటేషన్ వర్కర్లకు బకాయి జీతాలు వెంటనేచెల్లించాలన్నారు. ప్రతి నెలా 10వ తేదీ లోపు జీతం వెయ్యాలనీ, మినిమం టైం స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పిఎఫ్, తీఎస్ ఐ సకాలంలో కట్టాలన్నారు. క్లాప్ వాహన డ్రైవర్లకు జీవో నెంబర్ 7 ప్రకారం 18500 జీతం చెల్లించాలనీ ప్రభుత్వం. కార్మికులు రిటైర్మెంట్ వయస్సు 62 ఏళ్లకు పెంచి,పిఎఫ్ సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యదర్శి నివేదికను కార్యదర్శి ఎ.జగన్మోహన్ రావు ప్రవేశ పెట్టారు. యూనియన్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.వై నాయుడు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె సురేష్ మాట్లాడారు. అనంతరం నూతన కమిటీ.అధ్యక్ష, కార్యదర్శులుగా ఎ.జగన్మోహన్‌రావు, బొగ్గ భాస్కరరావు, గౌరవ అధ్యక్షులుగా బి. రమణ, గౌరవ సలహాదారుగా నీలాపు పైడిరాజు, శ్రామిక మహిళ కన్వీనర్‌గా జి.కుమారి, ఉపాధ్యక్షులుగా కె.రామ చంద్రరావు, యస్ .రామునాయుడు, సహాయ కార్యదర్శిగా ఎం మురళి, కోశాధికారిగా అనకాపల్లి రాఘవ ,15 మంది కమిటీ సభ్యులు ఎన్నికయ్యారు.

మహిళా ప్రాంగణంలో శిక్షణకు ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లా కేంద్రంలోని ఎన్‌టిఆర్ నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికారత కేంద్రం (మహిళా ప్రాంగణం)లో పలు వృత్తుల్లో శిక్షణ పొందేందుకు ఆసక్తి కలిగిన యువతులు, గృహిణుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రాంగణం మేనేజర్ పి. విమల తెలిపారు. బేసిక్ కుట్టు మిషన్ ఆపరేటర్, బ్యూటీషియన్, మగ్గం వర్క్ తదితర అంశాలపై శిక్షణ వుంటుందన్నారు. ఈ మూడు కోర్సుల్లో శిక్షణ పొందగోరే మహిళల వయస్సు 18 నుంచి 40 సంవత్సరాల మధ్య వుండాలని పేర్కొన్నారు. కుట్టు మిషన్ ఆపరేటర్, మగ్గం వర్క్ లో శిక్షణ పొందేందుకు కనీస విద్యార్హత 8వ తరగతి ఉత్తీర్ణతగా వుంటుందని, బ్యూటీషియన్ కోర్సుకు 10వ తరగతి ఉత్తీర్ణత అవసరమని పేర్కొన్నారు. బ్యూటిషియన్ కోర్సు శిక్షణ 3 నెలలు, మిగిలిన రెండు కోర్సులకు 2 నెలల పాటు శిక్షణ వుంటుందని పేర్కొన్నారు. శిక్షణ పొందే వారు ఆగష్టు 18వ తేదీ లోగా దరఖాస్తు చేయాలని, 20 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నట్లు పేర్కొన్నారు.

పారిశుధ్య నిర్వహణకు సహకరించాలి

కార్మికులతో మాట్లాడుతున్న కమిషనర్ ఎంఎం నాయుడు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించిన నగరపాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. దాసన్నపేట, అశోక్ నగర్ లోనూ, కంటోన్మెంట్,బొగ్గుల దిబ్బ తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య పరంగా నిర్వహిస్తున్న పనులను పరిశీలించారు. ఎక్కడా నీరు నిల్వ లేకుండా జాగ్రత్త వహించాలని సిబ్బందికి ఆదేశించారు. నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వృద్ధి కేంద్రాలుగా తయారవుతాయని దీనివల్ల అంటురోగాలు ప్రబలే అవకాశం ఉంటుందని చెప్పారు. కాలువల్లో పూడికలను ఎప్పటికప్పుడు తొలగించాలని సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో పారిశుధ్య పర్యవేక్షకులు సాలెం రాజు తదితరులు పాల్గొన్నారు.

కాలువ సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు

గంటస్తంభం ప్రాంతంలో ఉన్న ప్రధాన కాలువ సమస్య శాశ్వత పరిష్కారానికి నగరపాలక సంస్థ అధికారులు సన్నద్ధమయ్యారు. కమిషనర్ ఎంఎం నాయుడు ఆదేశాల మేరకు ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, ఇఇ కె. శ్రీనివాసరావు, పారిశుధ్య పర్యవేక్షకులు ప్రధాన కాలువ స్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంహెచ్ఒ మాట్లాడుతూ వర్షాలు కురిసే సమయంలో గంటస్తంభం సమీపంలో ఉన్న ప్రధాన కాలువతో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. రద్దీగా ఉండే మార్కెట్ ప్రాంతం కావడంతో ప్రధాన కాలువలో చెత్త అధిక శాతం లో పేరుకుపోవడం పరిపాటిగా మారిందన్నారు. కాలువలో ఉన్న రెండు చిన్న కాలువలను యంత్రాల సహాయంతో పూడికను తొలగించడం, శాశ్వత ప్రాతిపదికన నెట్‌లు నిర్మించడం తద్వారా వర్షపునీరు సజావుగా పెద్ద చెరువులోకి తరలిపోయే విధంగా చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్లు బాలకష్ణ, అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

కూటమిది ప్రజా పాలన

టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు నాగార్జున

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్రం లోని కూటమి ప్రభుత్వం ప్రజా పాలన అందిస్తోందని టిడిపి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు కిమిడి నాగార్జున, ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. మంగళవారం అశోక్ బంగ్లాలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రజా నిర్ణయాలకు అనుగుణంగా పరిపాలన అందిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో తాజాగా ఇళ్ల నిర్మాణాలపై చంద్రబాబు చేసిన ప్రకటన పేదలకు వరం లాంటిదని అన్నారు. 2014లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన తరువాత గ్రామాల్లో రూ.2 లక్షలు, పట్టణాల్లో రూ.3లక్షలు ఇచ్చి గృహ నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. గత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో కేంద్రం ఏదైతే రూ.1,80,000 ఇచ్చిందో లబ్ధిదారుకు అదే మొత్తం అందజేశారని తెలిపారు. తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టణ పరిధిలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు స్థలం ఇస్తామని ప్రకటించారని తెలిపారు. గత ప్రభుత్వంలో ఏవైతే గృహాలు అసంపూర్ణంగా ఉండిపోయాయో వాటిని కూడా పూర్తి చేయడానికి ప్రభుత్వం ముందుకు వచ్చిందని తెలిపారు. సమావేశంలో టిడిపి పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, కార్యదర్శి బంగారు బాబు, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కార్యదర్శి గంటా పోలినాయుడు, ఎంపిటిసిలు రాజేష్ బాబు, వేచలపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రెవెన్యూ వసూళ్లు వేగవంతం చేయాలి

అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రెవెన్యూ వసూళ్లను వేగవంతం చేయాలని ఆర్ఐలకు నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు ఆదేశించారు. మంగళవారం తన ఛాంబర్‌లో సమీక్ష సమావేశంలో రెవెన్యూ వసూళ్ల పనితీరు, పురోగతిపై చర్చించారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను మిగిలి ఉన్న అన్ని బకాయిలను వసూలు చేసే విధంగా కృషి చేయాలన్నారు. కొత్తగా ఆస్తి పన్ను విధింపు విషయంలో కూడా నిర్లక్ష్యం వద్దని సూచించారు. ఇంకా పన్ను విధింపులేని ఆస్తులు, ఖాళీ స్థలాల వివరాలను యుద్ధ ప్రాతిపదికన సేకరించి అవసరమైన పన్ను విధింపు జరిగేలా చూడాలన్నారు. నగరపాలక సంస్థ ఆధీనంలో ఉన్న షాపుల అద్దె బకాయిలను కూడా వెనువెంటనే వసూలు చేయాలని చెప్పారు. సమావేశంలో రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, రెవిన్యూ ఇన్స్పెక్టర్లు కిరణ్, వినోద్, సాయి కిరణ్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం చేయండి

డెంకాడ: సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని డిఎంహెచ్ఒ భాస్కరరావు అన్నారు. మండలంలోని డెంకాడ, పినతాడివాడ గ్రామాల్లో జరుగుతున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. రోగులకు, గర్భిణులకు అందుతున్న సేవలు గురించి ఆరా తీశారు. అనంతరం డెంకాడ పిహెచ్‌సిని పరిశీలించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు జరిగేలా, ఎఎన్ఎం, ఆరోగ్య సిబ్బంది సేవలు అవలోకన పై దృష్టి పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

బొబ్బిలిరూరల్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని బొబ్బిలి సిహెచ్‌సి వైద్యులు అరవింద్ కృష్ణకుమార్, పక్కి పిహెచ్‌సి వైద్యులు తనుజ సూచించారు. మంగళవారం సిహెచ్ బొడ్డవలస గ్రామ పంచాయతీ పరిధి కొయ్యకొండ వలస, చెల్లవలస గిరిజన గ్రామాలలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు వర్షాకాలంలో వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం పలు వ్యాధులకు చికిత్సలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎంలు, ఆశాలు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

బొబ్బిలి: గర్భిణులకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. గొల్లపల్లి అర్బన్ హెల్త్ సెంటర్‌లో వైద్యాధికారి అమిత చేతులు మీదుగా గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ మాత, శిశు వరణాలు నివారణకు పని చేస్తుందని డిస్ట్రిక్ట్ చైర్ జెసి రాజు, పోలియో చైర్ వారాణసి శ్రీహరి, అధ్యక్షులు ఎస్.శ్రీనివాస్ అన్నారు. గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటేనే తల్లీ, బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని వైద్యులు అమిత అన్నారు. రోటరీ సేవలను కొనియాడారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

బొబ్బిలి: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చునని ఐసిడిఎస్ సూపర్ వైజర్ అరుణ అన్నారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో మంగళవారం రెండో సెక్టార్ అంగన్వాడీలతో సమావేశం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చునన్నారు. పౌష్టికాహార సక్రమంగా అందజేయాలని కోరారు.

తహశీల్దార్ శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ

మెంటాడ: మండల తహశీల్దార్‌గా కోరాడ శ్రీనివాసరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు రెవెన్యూ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. అనకాపల్లిలో పనిచేసి బదిలీపై ఇక్కడకు వచ్చారు. మండలంలో రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన అన్నారు.

బాలికల వసతి గృహాల పరిశీలన

వేపాడ: వేపాడ గ్రామ సచివాలయ పరిధిలో గల బక్కు నాయుడుపేట డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల వసతి గృహం, కస్తూరిబా బాలికల వసతి గృహాలను ఎంఇఒ పి.బాల వెంకటరావు మంగళవారం పరిశీలించారు. ముందుగా వసతి గృహంలోని ఏర్పాటు చేసిన లైబ్రరీ పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. కస్తూరిబాయి బాలికల విద్యార్థులకు ఇస్తున్న మధ్యాహ్న భోజనాన్ని కూడా పరిశీలించి బాలికలతో కలిసి భోజనం చేశారు. ఈ పరిశీలనలో బ్రిడ్జ్ స్కూల్ ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ ఉషారాణి, కెజిబివి వసతి గృహం ఎస్ఒ కరణ్యం, స్కూల్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మేజర్ పంచాయతీలో పారిశుధ్య పనులు

మెరక ముడిదాం: మండలంలోని గర్భాం మేజర్ పంచాయతీలో గత మూడు రోజులు నుంచి పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. ప్రధాన కాలువలలో పేరుకు పోయిన చెత్తను తొలగించడం, ప్రధాన రహదారులను శుభ్రపరచడం, మురుగు నీరు ఎక్కడ కూడా నిలవ లేకుండా చూడడం, కాలువలు, హ్యాండ్ బోరేలు వద్ద ప్రధాన రహదార్లపై బ్లీచింగ్ చల్లడం వంటి కార్యక్రమాలు గ్రామ సర్పంచ్ గాబ్రియేల్, ఉప సర్పంచ్ తాడ్డి సత్యం నాయుడు ఆధ్వర్యంలో చేపట్టారు. కార్యక్రమంలో బిల్ కలెక్టర్ చండక శ్రీనివాసరావు కూడా ఉన్నారు.

భవిత కేంద్రాన్ని పరిశీలించిన డిఇఒ

శృంగవరపుకోట: మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమ్‌కుమార్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా తెలుగు, గణితం సబ్జెక్టులపై పిల్లలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను పరిశీలించి వారికి అందిస్తున్న ఆహారం సంతృప్తికరంగా ఉందని తెలిపారు. భవిత కేంద్రంలో ఉన్న వికలాంగ విద్యార్థులతో ముచ్చటించారు. అనంతరం ఎంఇఒ కార్యాలయాన్ని తనిఖీ చేసి ఎంఆర్‌సి సిబ్బందితో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ నర్సింగరావు, ఎంఇఒ-2 లక్ష్మి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాడి పశువుల ద్వారా రైతుకు ఆర్థికాభివృద్ధి

శృంగవరపుకోట: పాడి పశువుల ద్వారా రైతుకు ఆర్థికాభివృద్ధి కలుగుతుందని జిల్లా పశువైద్య సహాయ చికిత్సలు డాక్టర్ ఎంవి జగదీష్ కుమార్ అన్నారు. మండలంలోని వేములపల్లి గ్రామంలో రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆర్థిక సహకారంతో ఆంధ్రప్రదేశ్ పశు గణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం, పాడి రైతుల అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా 52 పశువులకు గర్భకోశ తనిఖీలు నిర్వహించి ఉచితంగా మందులు సరఫరా చేశారు. అనంతరం నిర్వహించిన అవగాహన సదస్సులో 46 మంది రైతులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి గనివాడ హేమ, బిజెపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఇందుకూరి సుధారాణి, స్థానిక సర్పంచ్, మాజీ సర్పంచ్, గ్రామ పెద్దలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కారు టైరు పంక్చరై ఇద్దరికి గాయాలు

భోగాపురం: జాతీయ రహదారిపై వెళ్తున్న కారు టైరు పంక్చరై మరో కారును ఢీకొట్టింది. ఆ కారు ఎదురుగా ఉన్న క్రేన్‌ను ఢీ కొట్టడం తో పంక్చరైన కారులో ఉన్న మహిళతో పాటు మరో వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ప్రమాదం మంగళవారం సాయంత్రం అవంతి కళాశాల సమీపంలో జరిగింది. జాతీయ రహదారుల మెయింటెనెన్స్ సంస్థకు చెందిన క్రేన్ మరమ్మతులకు గురవడంతో అవంతి కళాశాల వద్ద నిలిపివేశారు. ఆ క్రేన్‌ను మరమ్మతులు చేసేందుకు కంపెనీ మెకానిక్‌లు కారులో వచ్చారు. ఇంతలో విశాఖ నుంచి శ్రీకాకుళం వైపు వెళుతున్న కారు అక్కడికి వచ్చేసరికి కారు టైరు ఒక్కసారిగా పంచర్ అయి మెకానిక్‌లు వచ్చిన కారును ఢీకొంది. ప్రమాదానికి గురైన ఇద్దరిని హైవే సిబ్బంది ఆసుపత్రికి తరలించారు. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటం

రేగిడి: ప్రజా సమస్యల పరిష్కారం కోసం సిపిఐ నిరంతరం పోరుబాట సాగిస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ అన్నారు. మంగళవారం రాజాం పట్టణంలో ఐక్యరాజ్ వెనక కళావేదికలో సిపిఐ రాజాం నియోజకవర్గ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఉల్లాకుల నీలకంటేశ్వర యాదవ్ అధ్యక్షత నిర్వహించిన సమావేశంలో ఒమ్మి రమణ మాట్లాడారు. దేశంలో మోడీ నాయకత్వంలో బిజెపి అనుసరించిన మతోన్మాద చర్యలను, కార్పొరేట్ శక్తులకు దేశంలోని వ్యవస్థలను కారు చౌకగా కట్టబెట్టే విధానాలను తిప్పి కొట్టాలన్నారు. నాయకులు పాల్గొన్నారు.

గోవులను రక్షించాలని ధర్నా

విజయనగరం టౌన్: విజయనగరంలో గోవులను అతి దారుణంగా చంపి, వాటి మాంసాన్ని విదేశాలకు రవాణా చేస్తున్న నిందితులను శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ గోసంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు లోగిశ రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం కొత్తపేట నీళ్ళట్యాంక్ సెంటర్‌లో గల కృష్ణుడి విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో గోవులను చంపి వాటి మాంసాన్ని కంపెనీలకు ఎగుమతి చేస్తున్న వారిపై చర్య తీసుకోవాలన్నారు అధికారులు వారితో కుమ్మక్కవుతున్నారని ఆరోపించారు. గోవులను కాపాడాల్సిన అధికారులు కసాయి వాళ్లకు పూర్తి అండదండలు అందిస్తున్నారని గోవిందుడే గోవులను రక్షించుకోవాలని కోరుతూ కృష్ణుడి విగ్రహానికి వినతిని నిరసన తెలిపారు. కార్యక్రమంలో కెవిఆర్ సత్యనారాయణ, రాజకుమార్, తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో చేరిందుకు సమావేశం

వేపాడ: మండలంలోని జాకేరు సర్పంచ్ బుద్ధ చిన్నమ్మలు, అప్పల నాయుడు దంపతులు టిడిపిలో చేరేందుకు కార్య కర్తలు, నాయకులతో మంగళవారం తన నివాసంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి చెందాలంటే అధికార పార్టీలో వెళ్లాల్సి ఉంది. దీనికి కార్యకర్తలు, నాయకులు అంగీకరించడంతో త్వరలో వైసిపిని వీడి టిడిపిలో చేరుతామని చెప్పారు సొంతం చేశారు. ఈ సమావేశంలో జాకేరు సర్పంచ్ వారి అనుచరనాయకులు, వార్డు మెంబర్లు కలవలపల్లి శ్రీనివాసరావు, కోల రమణమ్మ, సలాది సత్యవతి, మిరియాల ముత్యాలమ్మ, జుత్తక నాగేష్, సుంకరి రామ సత్యం, బుద్ధ హైమావతి, పాల సంఘం అధ్యక్షుడు కర్రి నరసింహమూర్తి, వేతన కార్యదర్శి కోల వీరన్న దొర, స్కూల్ కమిటీ చైర్మన్ వాసుదేవరావు, వైస్ చైర్మన్ నాగమణి, పాల్గొన్నారు.

కార్యకర్తలతో మాట్లాడుతున్న సర్పంచ్ దంపతులు

జిఒ 117ను వెంటనే రద్దు చేయాలి

ప్రజాశక్తి - దత్తిరాజేరు

జిఒ 117 రద్దు చేయాలని, 3,4,5 తరగతుల తరలింపును (మెర్జింగ్‌ను) రద్దు చేసి, ప్రీ ప్రైమరీతో పాటు 1 నుంచి 5 తరగతులు ఒకే పాఠశాలగా నడపాలని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఎంఆర్‌సి వద్ద యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో ఎంఇఒలకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ కిల్లాడ అప్పారావు, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చంద్రరావు, టి.రమేష్ మాట్లాడుతూ తరగతికొక ఉపాధ్యాయుడిని నియమించాలని, హైస్కూల్స్‌లో సమాంతరంగా రెండు మీడియంలు కొనసాగించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సిలబస్, ఒకే పరీక్షా విధానం అమలు చేయాలని, ఎమ్‌టిఎస్ ఉపాధ్యాయులను రెగ్యులరైజ్ చేయాలని, పాఠశాలలకు రావాల్సిన అన్ని గ్రాంట్లు విడుదల చేయాలని కోరారు. బోధనేతర పనులను రద్దు చేయాలన్నారు. మండలంలో అవసరమైన చోట వర్క్ అడ్జస్ట్‌మెంట్ చేయాలని ఎపిజిఎల్ఐ లోన్లు వెంట వెంటనే ఫార్వర్డ్ చేయాలని, రెగ్యులర్ ఉపాధ్యాయులతో పాటే ఎమ్‌టిఎస్ ఉపాధ్యాయులకు జీతాల బిల్లులు పెట్టి సకాలంలో జీతాలు అయ్యేలా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల ఉపాధ్యక్షులు మాధవీలత, కోశాధికారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: విద్యావ్యవస్థకు పెను విఘాతంగా మారుతున్న జీవో 117ను రద్దుచేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.విజయగౌరి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మండల విద్యాశాఖాధికారి ఆమిటి తిరుమల ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 3,4,5 తరగతుల తరలింపును రద్దుచేయాలని, ప్రీ ప్రైమరీతో పాటు 1 నుంచి 5 తరగతులను ఒకే పాఠశాలలో నడపాలని, తరగతికి ఒకే ఉపాధ్యాయుడిని నియమించాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సిలబస్, ఒకే పరీక్షా విధానాన్ని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు వి.ప్రసన్నకుమార్, జిల్లా కార్యదర్శి ఎం.కేశవరావు, యుటిఎఫ్ మండల అధ్యక్షులు సుధాకరరావు తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: ఎంఇఒకు వినతి పత్రాన్నిస్తున్న యుటిఎఫ్ నాయకులు విజయగౌరి, తదితరులు

నిరంకుశ వైఖరి నశించాలి

శృంగవరపుకోట: ఎస్‌కోట ఆర్‌టిసి డిపో మేనేజర్ నిరంకుశ వైఖరి నశించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ యూనియన్ ఆధ్వర్యంలో 2వరోజు మంగళవారం డిపో గేటు ముందు ధర్నా నిర్వహించారు. జిల్లా కార్యదర్శి బి.యస్.రాములు హాజరై డిపో మేనేజర్ నిరంకుశ వైఖరపై ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమం జోనల్ ఉపాధ్యక్షులు జి.యస్ రాజు, విజయనగరం డిపో కార్యదర్శి మౌలి, గ్యారేజీ కార్యదర్శి కె.ఆనంద్, డిపో అధ్యక్షులు జి.వి.రమణ, డిపో సభ్యులు పాల్గొన్నారు.

చర్చలకు ఆహ్వానించినా నిరాకరించి ధర్నా

డిపోలో ఉన్న కొన్ని సమస్యలపై సభ్యులను చర్చిలకు ఆహ్వానించినా నిరాకరించి గేటు ధర్నా నిర్వహిస్తున్నారని డిపో మేనేజర్ కె.రమేష్ అన్నారు. ఈ ధర్నా ముమ్మాటికి వ్యక్తిగత లాభాపేక్ష కొరకే చేస్తున్నారని సమస్యల పరిష్కారం కోసం డిపో కమిటీతో చర్చలకు ఎల్లవేళలా తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు.

ఎస్‌పిని కలిసిన బేబినాయన

ప్రజాశక్తి- బొబ్బిలి

జిల్లా ఎస్‌పి వకుల్ జిందాల్‌ను ఎమ్మెల్యే బేబినాయన మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా ఎస్‌పిగా వకుల్ జిందాల్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత బేబినాయన కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు చెప్పారు.

పన్నుల వసూళ్లకు ప్రత్యేక చర్యలు

మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి

ప్రజాశక్తి- బొబ్బిలి

మున్సిపాలిటీలో పన్నుల వసూళ్లకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి చెప్పారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మున్సిపాలిటీలో నీటి పన్ను బకాయి రూ.1.50కోట్లు, ఖాళీ స్థలాల పన్ను బకాయి రూ. 1.8కోట్లు మున్సిపల్ షాపుల అద్దె బకాయి రూ.95లక్షలు ఉందన్నారు. పన్నులు, అద్దె వసూళ్లపై ప్రత్యేక నిఘా పెట్టడంతో రోజుకు నీటిపన్ను రూ.38వేలు, ఖాళీ స్థలాల పన్ను రూ.80వేలు, షాపులు అద్దె రూ.1.50లక్షలు వరకు వసూలు అవుతుందని చెప్పారు. కూరగాయలు మార్కెట్ షాపులు అద్దె రూ.56లక్షలు ఉందని, షాపింగ్ కాంప్లెక్స్ లోపలకు పశువులు రాకుండా గేట్లు వేయాలని, షాపులు బాగు చేయాలని కోరినట్లు చెప్పారు. గేట్లు ఏర్పాటుకు, షాపులు బాగు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి టెండర్లు పిలిచినట్లు చెప్పారు. ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి శ్రీదాడితల్లి ఆలయం వరకు బైపాస్ రోడ్డు బాగు చేసేందుకు రూ.2.25కోట్లు, జయప్రకాష్ పాఠశాల రోడ్డు బాగు చేసేందుకు రూ.35లక్షలతో ప్రతిపాదనలు వేసి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే బేబినాయనను కోరుతామని చెప్పారు. తాండ్రపాపరాయ విగ్రహం సుందరీకరణకు రూ.10లక్షలతో ప్రతిపాదనలు చేశామని చెప్పారు. బిపిఎస్ నిధులు రూ.42లక్షలు మంజూరయ్యాయని, వీటిని కాలువలలో పూడికలు తీతకు, సీజనల్ వ్యాధులు నివారణకు ఖర్చు చేయాలని ప్రభుత్వం సూచినట్లు చెప్పారు. సురక్షితమైన తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సీజనల్ వ్యాధులు నివారణకు పారిశుధ్య పనులు చేస్తున్నామని చెప్పారు.

శివారు భూములకు నీరందించాలి

ఎమ్మెల్యే కళా వెంకటరావు

ప్రజాశక్తి - చీపురుపల్లి

శివారు ఎకరం వరకు తోటపల్లి నుండి సాగు నీరందించాలని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని గల తోటపల్లి కాలువను ఎమ్మెల్యే కళావెంకటరావు మంగళవారం మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు, కె త్రిమూర్తులు రాజులతో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా కాలువ చివరకు ఉన్న చీపురుపల్లి మండలానికి చెందిన దాదాపు అన్ని గ్రామాల చెరువులను నింపే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో ఏ ఒక్క రైతు నీరందక ఇబ్బందులు పడకూడదని అన్నారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక జివిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. ఆయన వెంట తోటపల్లి ప్రాజెక్టు అధికారులు, టిడిపి, జనసేన నాయకులు ఉన్నారు.

కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు

ఒడిఎఫ్ సర్వే పరిశీలించిన డిపిఒ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మండలంలోని కొత్తపేట గ్రామంలో ఒడిఎఫ్ సర్వేను జిల్లా పంచాయతీ అధికారి ఎల్.ఎన్.వి.శ్రీధర్ రాజా మంగళవారం పరిశీలించారు. గ్రామంలో సర్వే ప్రగతిని పంచాయతీ కార్యదర్శి మరడాన ధరణీశ్వరిని అడిగి తెలుసుకున్నారు. సర్వే తీరును శ్రీధర్ రాజా ప్రత్యక్షంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎంపిడిఒ జి.రామారావు, ఇఒపిఆర్‌డి కె. సింహాద్రి, వెల్ఫేర్ సెక్రటరీ జగదీష్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సాయి కిరణ్, సర్వేయర్ రవితేజ వున్నారు.

నెల్లిమర్ల: సిబ్బందితో మాట్లాడుతున్న డిపిఒ

డిపిఒ ఆకస్మిక పర్యటన

జామి: జామి మేజర్ పంచాయతీలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్ రాజా మంగళవారం పారిశుధ్య పనులను పరిశీలించారు. వీధులన్నీ పరిశుభ్రంగా ఉంచాలని, దోమలు నివారణకు ఫాగింగ్ చేయాలని అదేశించారు. ప్రజలకు రోగాలు ప్రబలకుండా పారిశుధ్య నిర్వహణ పటిష్టంగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ తిరుమలరావు, ఇఒపిఆర్‌డి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసుల్లో కఠినంగా వ్యవహరిస్తాం : ఎస్‌పి

10కేజీల గంజాయి పట్టివేత

ఏడుగురు అరెస్టు

వివరాలను వెల్లడిస్తున్న ఎస్‌పి జిందాల్

ప్రజాశక్తి-విజయనగరం కోట

గంజాయి కేసుల్లో కఠినంగా వ్యవహరిస్తామని ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. రాజాం పోలీసు స్టేషను పరిధిలో గంజాయి అక్రమంగా కలిగి, రవాణకు పాల్పడుతున్న ఏడుగురు నిందితులను అరెస్టు చేయడంతోపాటు, వారికి సహకరిస్తున్న ఒక జ్యువినల్ ను కూడా అదుపులోకి తీసుకున్నట్లుగా తెలిపారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఎస్‌పి మాట్లాడారు. రాజాంలో ఈనెల 29న ముగ్గురు వ్యక్తులు గంజాయిని ఒడిస్సా రాష్ట్రం కోరాపుట్‌లో కొనుగోలు చేసి, రాజాం నుండి చిలకపాలెం వైపు అక్రమంగా రవాణ చేస్తూ అంతకాపల్లి గ్రామ జంక్షన్ వద్ద రాజాం పోలీసులకు పట్టుబడ్డారని తెలిపారు. నిందితుల్లో కోరాపుట్ జిల్లా పొట్టంగి బ్లాక్, ములగూడ గ్రామానికి చెందిన సలవు పంగి (24) గంజాయిని కోరాపుట్ నుండి తీసుకొని బైకుపై రాజాం రాగా, అతని వద్ద శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్లకు చెందిన బొద్దాన సౌమిత్, జరజాం గ్రామానికి చెందిన ముద్దాడ వెంకటేష్ అలియాస్ వెంకీ కొనుగోలు చేస్తుండగా రాజాం పోలీసులకు పట్టుబడ్డారని తెలిపారు. వీరి నుంచి రూ.2లక్షలు విలువైన 10.825 కిలోల గంజాయిని, ఒక పల్సర్ బైకు, మూడు సెల్ ఫోన్లును పోలీసులు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. నిందితులు విచారణంలో వెల్లడించిన సమాచారం రాజాంకు చెందిన శ్రీధర్ (29), చిప్పాడ అరుణ్ కుమార్ (27), జక్కం దీపక్ (23), రేగిడి ఆమదాల వలసకు చెందిన దంగల మణికంఠలను వీరితో పాటు మరో జ్యువినల్ ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌పి తెలిపారు. గంజాయి కేసుల్లో పట్టుబడిన వారిపై సస్పెక్ట్ షీట్లు ఓపెన్ చేసి, వారి కదలికలపై నిఘా పెడతామన్నారు. గంజాయి అక్రమ రవాణకు తరుచూ పాల్పడి, పట్టుబడితే వారిపై పిడి చట్టం కూడా ప్రయోగిస్తామని హెచ్చరించారు. గంజాయి సేవించడం ఒకసారి అలవాటైతే త్వరితగతిన గంజాయిని సేవించేందుకు బానిసగా మారుతారని, విలువైన జీవితాన్ని కోల్పోతారని తెలిపారు. యువత గంజాయి, ఇతర మత్తు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని ఎస్‌పి కోరారు. గంజాయి గురించిన సమాచారం ఉంటే 9121109416కు తెలపాలని కోరారు. సమావేశంలో చీపురుపల్లి డిఎస్‌పి ఎ.ఎస్.చక్రవర్తి, రాజాం ఇన్‌స్పెక్టర్ డి.మోహనరావు, స్పెషల్ బ్రాంచ్ సిఐ ఇ.నర్సింహమూర్తి, రాజాం ఎస్ఐ రవి కిరణ్ పాల్గొన్నారు.

చేతులు పరిశుభ్రతతో రోగాలు దూరం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

డెటాల్ బనేగా స్వస్థ ఇండియా నిర్వహించనున్న విద్యార్థుల పరిశుభ్రతపై సోషల్ యాక్టివిటీస్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల నుంచి ఎంపిక చేసిన పాఠశాలల ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమం మంగళవారం పిఎస్‌ఆర్ హైస్కూల్లో జరిగింది. స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆర్‌బిఎస్‌కెపిఒ డాక్టర్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతుల పరిశుభ్రత ద్వారా 80 శాతం వ్యాధులు నియంత్రించవచ్చని అన్నారు. సబ్బుతో చేతులను శుభ్రంగా కడుక్కోవడం ద్వారా రోగాలను కడిగేయవచ్చని అన్నారు. చేతులు శుభ్రంగా కడుక్కొని, ఆహారాన్ని తీసుకోవాలని విద్యార్థులకు తెలియజేయాలని చెప్పారు . మనం ఆరోగ్యంగా ఉండాలంటే ముందు మన చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ఉంది. విజయనగరం ఎవిఒ 2 సత్యవతి మాట్లాడుతూ పాఠశాలలలో పిల్లల వ్యక్తిగత పరిశుభ్రత గురించి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లుతెలిపారు. కార్యక్రమంలో వివిధ మండలాల నుండి 65 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. శిక్షణ అనంతరం ఎంఇఒ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో డిబిఎస్‌యు ప్రతినిధులు టి లక్ష్మి ,భగవాన్ దాస్, శంకరరావు వివిధ మండలాల నుంచి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అకాడమీ క్రీడాకారుల విజయభేరి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ఫ్రెండ్స్ రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు విజయభేరి మోగించారు. ఇక్కడ శిక్షణ పొందుతున్న పంపాన మౌనిక, భరణికాన హారిక, మహమ్మద్ నిషాద్ ఫాతిమా, మోపాడ జాన్సన్, మహమ్మద్ ఖలీలుల్లాలు విజయనగరం డిఎస్ఎ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 18 నుండి 21వ తేదీ వరకు జరిగిన జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్, సెలక్షన్స్ పోటీలలో విజయ దుందుబి మోగించారని అకాడమీ చీఫ్ కోచ్ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు తెలిపారు. వీరిని మంగళవారం బొడ్డవరలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ ఇందుకూరి రఘురాజు అభినందనలు తెలిపారు. శ్రీరాములు మాట్లాడుతూ మహమ్మద్ నిషాద్ ఫాతిమా 13 సంవత్సరాల విభాగంలో సింగిల్స్‌లో ద్వితీయ స్థానం, డబుల్స్ ప్రథమ స్థానం, 15 సంవత్సరాల విభాగంలో ప్రథమ స్థానం, మోపాడ జాన్సన్ 15 సంవత్సరాల విభాగంలో ప్రథమ స్థానం, భరణికాని హారిక 19 సంవత్సరాల విభాగంలో సింగిల్స్ ద్వితీయ స్థానం, డబుల్స్‌లో ప్రథమ స్థానం సాధించారన్నారు. పంపాన మౌనిక 19 సంవత్సరాల భాగంలో డబుల్స్ ప్రథమ స్థానం, ఉమెన్స్ విభాగంలో డబుల్స్ ద్వితీయ స్థానం, మొహమ్మద్ ఖలీలుల్లా మిక్స్ డబుల్స్ విభాగంలో ఆదిలక్ష్మి (విజయనగరం)తో కలిసి ప్రథమ స్థానం సాధించారని వీరు త్వరలో జరగబోవు రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో విజయనగరం జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని శ్రీరాములు తెలిపారు. వీరిని ఎస్‌కోట ఫ్రెండ్స్ బ్యాడ్మింటన్ అకాడమిక్ చెందిన డాక్టర్ ఎస్‌వి.సత్యశేఖర్, అట్లూరి వెంకటరావు, ఆనల రమేష్, ఆనల మోహన్‌లు అభినందించారు

తోటపల్లి కాలువ ఆక్రమణ పరిశీలన

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని గోవిందపురం రెవెన్యూలో తోటపల్లి కాలువను ఆక్రమించి లే అవుట్ వేసారంటూ గోవిందపురం ఎంపిటిసి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం అధికార్లు పరిశీలించారు. తోటపల్లి కాలువ ఇఇ కె.సుబ్బారావుతో పాటు మండల సర్వేయర్ గణపతిరావు, ఆర్ఐ మాధురీ, విఆర్ఒ జగదీష్ ఎకె డెవలపర్స్ లే అవుట్‌ను పరిశీలించారు. లే అవుట్‌లో కాలువ ఉందని, కానీ ఎక్కడ ఉందని తెలీలేదన్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ తాడి గోవింద మాట్లాడుతూ ఫిర్యాదు మేరకు లే అవుట్‌ను తోటపల్లి ఇరిగేషన్ అధికార్లతో పాటు రెవెన్యూ అధికార్లు పరిశీలించారన్నారు. అయితే ఆ లేవుట్‌లో కాలువ ఉందా లేదన్నది పరిశీలనలో ఉందన్నారు.

గూగుల్ మ్యాప్‌లు, భూసేకరణ మ్యాప్‌లు పరిశీలించాలని ఇరిగేషన్ వారికి తెలిపామన్నారు. ఆక్రమణ జరిగితే ఎంత వరకూ జరిగిందన్నది త్వరలో చెబుతామన్నారు. మండలంలోని మిగతా గ్రామాల్లో కూడా కాలువ చిన్న చిన్న ఆక్రమణలకు గురైందని సర్వే అధికార్లు చెప్పారన్నారు. వాటన్నింటిని తొలగిస్తామన్నారు.

మాదక ద్రవ్యాల నిరోధానికి చర్యలు

రామభద్రపురం: మాదక ద్రవ్యాలు గంజాయి, ఖైనీ, గుట్కా, నాటుసారా వంటివి నిరోధించడానికి పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్టు బొబ్బిలి డిఎస్‌పి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మత్తు పదార్థాల రవాణా నిరోధించడానికి పక్కా నిఘా ఏర్పాటు చేశామన్నారు. ముఖ్యంగా ఒడిషా రాష్ట్రం పక్కనే ఉండడంతో ఎక్కువగా ఈ మత్తు పదార్థాలు అక్రమ రవాణా జరుగుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. యువత, మైనర్లు ఈ మత్తు పదార్థాలకు అలవాటు పడడం వల్ల వారి జీవితాలు నాశనం కావడమే కాకుండా సమాజానికి హానికరంగా మారుతున్నారని తెలిపారు. వీటిపై ప్రజలకు, యువతకు అవగాహన కల్పించడానికి గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయనున్నామని తెలిపారు. ఈ సమావేశంలో బొబ్బిలి సిఐ తిరుమలరావు పాల్గొన్నారు.

క్రషర్ యజమానికి అభినందనలు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బొద్దాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంతా రాళ్లు తేలిపోయి ఉండటంతో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఈవిషయాన్ని తెలుసుకున్న శ్రీ వీరాంజనేయ బ్లూ క్రాస్ స్టోన్ యజమాని మురళి స్పందించి తన సొంత వాహనంపై 20 వేల రూపాయలు విలువ చేసే క్రసర్ బుగ్గ తెచ్చి పాఠశాల ఆవరణలో వేశారు. అనంతరం చదును చేసి విద్యార్థుల రాకపోకలు సాగించుచేందుకు వీలుగా ఏర్పాటు చేశారు. దీంతో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు క్రషర్ యజమానికి అభినందనలు తెలిపారు.

మొక్కలను సంరక్షించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

విద్యార్థులు మొక్కలను నాటడమే గాకుండా వాటిని సంరక్షించాలని సెంచూరియన్ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి పిలుపునిచ్చారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన తల్లి పేరు మీద ఒక మొక్క కార్యక్రమాన్ని మంగళవారం ఇక్కడ చేపట్టారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ తన తల్లి అన్నపూర్ణ మహంతి పేరు మీద ఒక మొక్కను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు వారి తల్లి పేరు మీద మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆర్ఎస్ వర్మ, డాక్టర్ సన్నీ డయోల్, డీన్ డాక్టర్ పుష్పలత, డాక్టర్ సతీష్, శ్రావణి, శ్యామల, అలన, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థులు

బొబ్బిలిరూరల్ : రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్‌కు పారాది ఉన్నత పాఠశాల జూనియర్ కళాశాల జట్టు బాలబాలికలు ఎంపిక అయినట్లు పిఇటి వెంకటి నాయుడు తెలిపారు. ఈ ఎంపికైన జట్లు ఆగస్టు నెల 17, 18, 19 తారీఖులో శ్రీకాకుళంలో రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొననున్నారని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు నాగేశ్వరరావు ఎంపికైన క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.

డ్రమ్ సీడర్‌తో అధిక దిగుబడులు

జామి : జామి గ్రామంలో డ్రమ్ సీడర్ ద్వారా వరినాట్లు వేయటం పట్ల రైతులకు అధికారులు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయా సంచాలకులు, ఎల్.విజయ రైతులకు, వ్యవసాయ సహాయకులకు స్వయంగా శిక్షణ ఇవ్వటంతో పాటు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి వచ్చే విధానాలైన డ్రమ్ సీడర్‌తో సాగు, యంత్రంతో నేరుగా విత్తే విధానం, యదసాగు మార్గాలు ఉపయోగిస్తే అధిక దిగుబడి సాధించవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఒ కిరణ్‌కుమార్, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు. అంతకు ముందు జామి రైతు సేవా కేంద్రంలో సహాయకులకు శాఖ పరమైన సమావేశం నిర్వహించారు. రైతులకు అందుబాటులో ఉండి, వ్యవసాయ యాజ మాన్యం పద్ధతులపై ఎప్పటికప్పుడు సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు.

పబ్లిక్ నోటీస్

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా నాక్లయింట్ అయిన విజయనగరం జిల్లా, విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్, దాసన్నపేట కాపురస్తులు గరక సన్యాసిరావుగారి కుమారుడు గరక బాలశ్రీనివాసరావుగారు ఇచ్చిన బోగట్టా ప్రకారం, నాక్లయింట్ ఇంటి యొక్క ఒరిజినల్ దస్తావేజులు, వాటి లింక్ ఒరిజినల్ సెటిల్మెంట్ దస్తావేజులు మరియు ఇతర దస్తావేజులు జెరాక్స్ నిమిత్తము తే12-07-2024 దిన నాక్లయింట్ ఇంటివద్ద నుండి బయలుదేరి RTC కాంప్లెక్స్‌కు వెళ్ళి అక్కడ నుండి కోట జంక్షన్‌కు వచ్చియున్నారు. సదరు దస్తావేజులను కోట జంక్షన్ వద్ద గల జెరాక్స్ అతనికి ఇచ్చుటకు చూడగా అందులో లింక్ దస్తావేజులు నెంబర్ 881/2003 కనపడలేదు. వచ్చిన దారి వెంబడి వెతకగా సదరు లింక్ దస్తావేజులు కనిపించలేదు. చుట్టు ప్రక్కల వారిని లింక్ దస్తావేజులు గురుంచి వాకాబు చేయగా ఎవరికీ దొరకలేదని చెప్పియున్నారు. నాక్లయింట్స్ విషయమై వన్-టౌన్ పోలీసుస్టేషన్, విజయనగరం వారికి సదరు దస్తావేజులు పోయినవని ఫిర్యాదు చేసియున్నారు. (అప్లికేషన్ నెం: M L D 012100439958, Date 12-07-2024). సదరు ఒరిజినల్ దస్తావేజులు ఎవరికైనా దొరికిన యెడల క్రిందినంబర్లుకు సంప్రదించి అందజేయగలరు. అటులకాక సదరు ఒరిజినల్ దస్తావేజులతో ఏవిధమైనచట్టవ్యతిరేకచర్యలు చేయరాదని, అట్టివి చట్టరీత్యా చెల్లనేరవని ఇందుమూలముగా పత్రికా ప్రకటనచేయడమైనది.

ఇట్లు
S.MADHU SUDHANA RAO,
ADVOCATE,
VIZIANAGARAM,
Cell:9440163944, 9052446888.

IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE AT VIZIANAGARAM.
IP: 27/2023.

Between:
Kopperla Vijay Kumar Raju
......Petitioner
And:
Kanta Vijaya Lakshmi and Others
......Respondents

NOTICE

Respondent No: 106

Dindu Ammadu, w/o(late) Suryam,Hindu, Aged about 55yrs, Resident of Perumalu, Village Rajam, Mandal, Vizianagaram, District.

Please take Notice that the above case is Stands Posted to **1-8-2024** for notice to Respondent No: 106, you should appear in person or through an Advocate at **10-30AM** on the above said date in the above Court. If you fails to appear on the said date that the above matter will be decided exparte.

D.NARAYANAPPADU
Advocate, Pradeepnagar
VIZIANAGARAM
Mobile: 9440108023